క్లుప్తంగా

అగ్నిప్రమాద బాధితులకు బియ్యం పంపిణీ



బాధితులకు బియ్యం పంపిణీ చేస్తున్న అధికారులు

సీతంపేట: మండలంలోని మల్లమ్మగూడలో ఇటీవల జరిగిన అగ్నిప్రమాదంలో నష్టపోయిన బాధితులకు అధికారులు మంగళవారం బియ్యం పంపిణీ చేశారు. తహసీల్దార్ ఎస్.నర్సింహమూర్తి, ఎంపీడీఓ కె.గీతాంజలి, జీసీసీ సేల్స్‌మెన్ కొండగొర్రె లక్ష్మణరావు తదితరులు బాధితులను పరామర్శించారు. ఒక్కో కుటుంబానికి పది కిలోల చొప్పున బియ్యం పంపిణీ చేశారు. బాధితులకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

పనితీరు పరిశీలన



సచివాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న ఐటీడీఏ పీఓ విష్ణుచరణ్

జియ్యమ్మవలస: మండలంలోని పెదబుడ్డిడి గ్రామ సచివాలయాన్ని ఐటీడీఏ పీఓ విష్ణుచరణ్ మంగళవారం సందర్శించారు. సచివాలయ సిబ్బంది పనితీరు, సంక్షేమ పథకాల లబ్ధిదారుల వివరాలను పరిశీలించారు. గృహ నిర్మాణాల పురోగతిపై ఏఈ ఉమా మహేశ్వరరావు వద్ద ఆరాతీశారు. నిర్మాణాలు త్వరితగతిన పూర్తయ్యేలా తగుచర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రమేష్, వర్క్ ఇన్‌స్పెక్టర్ ధనుంజయరావు తదితరులున్నారు.

విక్రమపురంలో ఉచిత వైద్యశిబిరం



వైద్య పరీక్షలు చేస్తున్న జెమ్స్ ఆస్పత్రి వైద్యులు

వీరఘట్టం: మండలంలోని విక్రమపురంలో మంగళవారం శ్రీకాకుళం జెమ్స్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 120 మందికి వైద్యులు వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. బీపీ, షుగర్, తదితర వైద్య పరీక్షలు ఉచితంగా చేయడంతో పాటు తీసుకోవాల్సిన ఆరోగ్య జాగ్రత్తలను రోగులకు వివరించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మాచర్ల వెంకటరమణ, క్యాంపు కో–ఆర్డినేటర్లు రాజేశ్వరరావు, కె.రమేష్, కె.వేణుమాధవ్ తదితరులున్నారు.

కుష్ఠు వ్యాధిపై అప్రమత్తం



అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి చిరంజీవి

పాలకొండ రూరల్: చర్మ సంబంధిత వ్యాధులపై అప్రమత్తత అవసరమని ఎం.సింగుపురం పీహెచ్‌సీ వైద్యాధికారి కడియం చిరంజీవి అన్నారు. స్పర్శ కార్యక్రమంలో భాగంగా జంపరకోట గ్రామంలో సర్పంచ్ ఆరిక వెంకటేష్ నేతృత్వంలో మంగళవారం కుష్ఠు వ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కుష్ఠు వ్యాధి లక్షణాలు, నివారణా చర్యలు, ప్రభుత్వం అందిస్తున్న వైద్య సేవలపై గ్రామస్తులను వివరించారు. చర్మంపై తెల్లని మచ్చలు, స్పర్శ లేకపోవటం వంటి లక్షణాలు కనిపిస్తే నిర్లక్ష్యం వహించకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది నిర్మలాదేవి, హిమవతి, రామలక్ష్మి, పెంటయ్య, పంచాయతీ కార్యదర్శి భూలక్ష్మి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రైతుల నుంచి ప్రతి గింజా కొనుగోలు చేస్తాం



బిల్లుమడలో రైతులతో మాట్లాడుతున్న ఏఓ సింహాచలం

భామిని: మండలంలోని బిల్లుమడ, నులకజోడు గ్రామాల్లోని రైతుల కళ్లాల్లో ఉన్న ధాన్యం నిల్వలను మండల వ్యవసాయాధికారి కొర్ను సింహాచలం మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇప్పటికే 13 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించామని, రెండో విడతలో 3 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణకు ఉన్నతాధికారులకు ప్రపోజల్స్ పంపినట్లు చెప్పారు. ఇప్పటికే కళ్లాల్లో ఉన్న ధాన్యం నిల్వలకు జియోట్యాగింగ్ చేసినట్లు చెప్పారు. అనుమతులు రాగానే ట్రిప్పుషీట్లు కేటాయిస్తామని, రైతులు ఆందోళన చెందాల్సిన పనిలేదని అన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

పాలకొండ: వాహన చోదకులు రోడ్డు భద్రత నిబంధనలు పాటించడం ద్వారా ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి సహకరించాలని ఎస్సై శివప్రసాద్ కోరారు. పట్టణంలోని ప్రధాన రహదారిలో మంగళవారం ట్రాఫిక్ రూల్స్‌పై వాహన చోదకులకు అవగాహన కల్పించారు. నోపార్కింగ్ స్థలాల్లో వాహనాలు నిలపడం ద్వారా ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోందన్నారు. రహదారిపై, నోపార్కింగ్ స్థలాల్లో వాహనాలు నిలిపితే అపరాధ రుసుం విధించనున్నట్లు చెప్పారు.

పక్కాగా భూముల రీసర్వే

- నెలకు 50 గ్రామాల్లో సర్వే పూర్తిచేసేందుకు చర్యలు
- జాయింట్ కలెక్టర్ ఒ.ఆనంద్



గరుగుబిల్లి: భూముల రీసర్వేపై ఆరాతీస్తున్న జేసీ ఆనంద్

గరుగుబిల్లి: భూముల రీసర్వేను పక్కాగా చేపట్టాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఒ.ఆనంద్ అన్నారు. మండలంలోని పెద్దూరులో నిర్వహిస్తున్న భూసర్వేను మంగళవారం ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెలకు 50 గ్రామాల్లో సర్వే పూర్తిచేసేలా యంత్రాంగాన్ని సన్నద్ధం చేసినట్లు చెప్పారు. జిల్లాలో 965 గ్రామాలకుగాను 500 గ్రామాల్లో డ్రోన్ సాయంతో సర్వే చేపట్టడం జరిగిందన్నారు. ఇంతవరకు 187 గ్రామాల్లో సర్వే పూర్తికాగా, 103 గ్రామాల్లో భూహక్కు పత్రాలను పంపిణీ చేయడం జరిగిందన్నారు. వందేళ్ల తరువాత రీసర్వే చేపడుతుండడంతో ఎలాంటి పొరపాట్లకు ఆస్కారం లేకుండా రికార్డుల ప్యూరిఫికేషన్ చేపట్టనున్నట్లు చెప్పారు. గ్రామాల్లో తగాదాలు లేకుండా రైతుల సమక్షంలో సర్వేను చేపట్టాలని సిబ్బందికి సూచించారు. చెరువులు, శ్మశానాలు ఆక్రమణకు గురికాకుండా చూడాలన్నారు. ఎవరైనా డీపట్టా భూములను కొనుగోలు చేస్తే వాటిని రద్దు చేయాలన్నారు. ఆయన వెంట తహసీల్దార్ అజు రఫీజాన్, రీసర్వే డీటీ శివున్నాయుడు, ఆర్ఐ ఎం.కృష్ణ, సర్వేయర్లు ఉమామహేశ్వరరావు తదితరులున్నారు.

భూసర్వేని పూర్తిచేయాలి

భామిని: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు– శాశ్వత భూ సర్వేని పారదర్శకంగా చేపట్టాలని సబ్‌కలెక్టర్ నూరల్ కమర్ అన్నారు. మండలంలో జరుగుతున్న భూముల సర్వేపై స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ సిబ్బందితో మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఇప్పటికే చేపట్టిన ముసాయిదా సర్వేకి సంబంధించిన రికార్డులను పరిశీలించారు. చిన్నదిమిలి, పెద్దదిమిలి, నులకజోడు గ్రామాల పరిధిలో జరుగుతున్న గ్రౌండ్ ట్రూథింగ్‌పై ఆరా తీశారు. గురండి, బత్తిలి, వడ్డంగి, బొమ్మిక రెవెన్యూ గ్రూపుల్లో పూర్తయిన డీఎల్ఆర్ సర్వే రికార్డులు పరిశీలించారు. తహసీల్దార్ నీలాపు అప్పారావు, సర్వేయర్ తోట రామ్మోహనరావు, డీటీ నిమ్మల శేఖరం పాల్గొన్నారు.



భామిని: సర్వే రికార్డులను పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ నూరల్ కమర్

ఐటీడీఏ పీఓ ఆకస్మిక తనిఖీ



విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరిశీలిస్తున్న పీఓ విష్ణుచరణ్

జియ్యమ్మవలస: మండలంలోని టీకేజమ్ము గ్రామంలోని గిరిజన సంక్షేమ వసతిగృహాన్ని ఐటీడీఏ పీఓ సి.విష్ణుచరణ్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు పెడుతున్న భోజనాల నాణ్యతను పరిశీలించి అసంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులకు ఉత్తమ బోధన, నాణ్యమైన పౌష్టికాహారం అందించడంలో రాజీపడద్దని స్పష్టం చేశారు. పదో తరగతిలో ఉత్తమ ఫలితాల సాధనకు కృషిచేయాలని, వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధతీసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు.



సీతంపేట: విద్యార్థుల విద్యా ప్రమాణాలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ గీతాంజలి

మల్లి గురుకులంలో ఎంపీడీఓ..

సీతంపేట: మల్లి గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలను ఎంపీడీఓ కోసూరు గీతాంజలి మంగళవారం సందర్శించారు. తరగతి గదులకు వెళ్లి విద్యార్థుల చదువులను పరిశీలించారు. చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, గ్రేడులుగా విభజించి పాఠాలు బోధించాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలని సూచించారు. ప్రిన్సిపాల్ రోణంకి వాసుదేవరావు, ఉపాధ్యాయ సిబ్బంది ఉన్నారు.

పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించాలి

- డీఈఓ వెంకటరమణ



సమావేశంలో మాట్లాడుతున్న డీఈఓ వెంకటరమణ

పాలకొండ రూరల్: పదోతరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేలా విద్యార్థులను సన్నద్ధం చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.డి.వెంకటరమణ అన్నారు. పాలకొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో డివిజన్ స్థాయి ఎంఈఓలు, హెచ్‌ఎంలతో మంగళవారం సమావేశం నిర్వహించారు. సిలబస్ పూర్తి, రికార్డుల నిర్వహణ, పాఠంశ్యాల ప్రణాళికలు, టీచర్ లెర్నింగ్ మెటీరియల్ నిర్వహణ, పాఠశాలల పర్యవేక్షణపై మండలాల వారీగా సమీక్షించారు. ప్రభుత్వం విద్యారంగానికి సమకూరుస్తున్న వనరులు సద్వినియోగపర్చుకుని ఉత్తమ ఫలితాల సాధనకు కృషిచేయాలన్నారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని, వారి సందేహాలను నివృత్తి చేయాలని సూచించారు. సమావేశంలో జిల్లా కోఆర్డినేటర్ సీహెచ్.శ్రీనివాసరావు, ఏపీఓ వైఏ హరిప్రసాద్, డిప్యూటీ డీఈఓ విజయకుమారి, ఎంఈఓ ఎం.సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సరఫరా పునరుద్ధరణ



పైపులైన్‌కు మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

పాలకొండ: నగర పంచాయతీకి తాగునీరు సరఫరా అవుతున్న పైపులైన్‌కు ఏర్పడిన లీకులను మంగళవారం సంబంధిత సిబ్బంది సరిచేశారు. పైపులైన్ శిథిలం కావడంతో రెండు రోజులుగా తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడింది. దీంతో నగరపంచాయతీ సిబ్బంది యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపట్టి నీటి సరఫరాను పునరుద్ధరించినట్లు కమిషనర్ సర్వేశ్వరరావు తెలిపారు.

ఆశాజనకంగా మొక్కజొన్న సాగు



గంగారేగువలసలో సాగులో ఉన్న మొక్కజొన్న

కొమరాడ: మండలంలో రబీలో ఆరుతడి పంటగా మొక్కజొన్న సాగుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు. దళాయిపేట, పాలెం, గంగారేగువలస, స్వామినాయుడు, మాదలింగి, తొడుము, తులసివలస, కెమిశీల తదితర గ్రామాల్లో ఎక్కువగా మొక్కజొన్న సాగులో ఉంది. మండలంలో ఈ రబీలో సుమారు 3వేల ఎకరాలు సాగులో ఉన్నట్లు వ్యవసాయశాఖ అధికారుల అంచనా. నీటితడి అధికంగా అవసం లేకపోవడం, తక్కువ పెట్టుబడి, మార్కెట్లో మంచి డిమాండ్ ఉండడం, ప్రభుత్వం కూడా గిట్టుబాటు ధర కల్పిస్తుండడంతో పంట సాగుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు. ప్రస్తుతం పంట ఆశాజనకంగా ఉంది. మొక్కజొన్నలో కత్తెర పురుగు ఆశించే అవకాశం ఉండడంతో వ్యవసాయశాఖ సిబ్బంది రైతులను అప్రమత్తం చేస్తున్నారు. తెగులు నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తున్నారు. నిత్యం రైతులకు అందుబాటులో ఉంటూ సలహాలు సూచనలు అందిస్తున్నారు.

అంతర్‌రాష్ట్ర రహదారి విస్తరణ పనుల పరిశీలన

పార్వతీపురంటౌన్: పార్వతీపురం–ఒడిశా రాష్ట్రాల మధ్య జరుగుతున్న అంతరాష్ట్ర రహదారి విస్తరణ పనుల్లో భాగంగా పార్వతీపురం మండలం చినబొండపల్లి గ్రామంలో పనులను స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకులతో కలిసి ఎమ్మెల్యే అలంజగి జోగారావు మంగళవారం పరిశీలించారు. రోడ్డు విస్తరణలో భాగంగా ఎటువంటి భేషజాలకు పోకుండా గ్రామమంతా ఏకమై రాజకీయాలకు అతీతంగా సహకరించినట్లు గ్రామ నాయకులు ఎమ్మెల్యేకు తెలియచేశారు. పనులను పరిశీలించిన ఎమ్మెల్యే గ్రామ ప్రజల చిరకాల వాంఛ నెరవేరుతుందని గ్రామం ప్రధాన రహదారి విస్తరణతో పాటు ఇరు వైపులా సీసీ కాలువల నిర్మాణం కూడా చేపట్టి పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా గ్రామనాయకులు, ప్రజలు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం చిన్నబొండపల్లి గ్రామంలో ఇంటింటికీ వెళ్లి మహిళలకు చీరలు, కొంతమొత్తం ఆర్థిక సాయం ఎమ్మెల్యే జోగారావు అందజేశారు.

ఉపాధి లక్ష్యాలు పూర్తిచేయాలి



పాలకొండ: బుక్కూరులో ఉపాధి వేతనదారులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ త్రినాథులు

పాలకొండ రూరల్: గ్రామాల్లో గుర్తించిన ఉపాధి పనులను సకాలంలో పూర్తిచేయాలని ఎంపీడీఓ దొంక త్రినాథులు అన్నారు. మండలంలోని యరకారాయపురం, బుక్కూరు, గొట్ట మంగళాపురం గ్రామాల్లో చేపడుతున్న ఉపాధి పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. వేతనదారుల మస్తర్లను తనిఖీ చేశారు. అనంతరం వారితో మాట్లాడారు. నిబంధనల మేరకు రెండు పూటలా పనులు చేయాలని, అప్పుడే సగటున రూ.250 వరకు వేతనం పొందవచ్చన్నారు. పని ప్రదేశం వద్ద కల్పించాల్సిన సౌకర్యాలపై సిబ్బందికి సూచనలు చేశారు. అనంతరం గ్రామ సచివాలయాలను సందర్శించి సంక్షేమ పథకాల అమలుతీరుపై సిబ్బందితో సమీక్షించారు.



జియ్యమ్మవలస: ఉపాధి వేతనదారుల మస్తర్లు పరిశీలిస్తున్న ఏపీఓ శ్రీనివాసరావు

పారదర్శకంగా మస్తర్ల నమోదు

జియ్యమ్మవలస: ఉపాధి పనులకు వచ్చేవారికే మస్తర్లు వేయాలని, మస్తర్ల నమోదులో అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఏపీఓ శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని గవరమ్మపేట పంచాయతీ వెంకటరాజపురంలో జరుగుతున్న ఉపాధి పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. రెండు పూటలా పనులు చేయించాలని, గిట్టుబాటు వేతనం పొందేలా పనులు కల్పించాలని సిబ్బందికి సూచించారు.

ఊపందుకున్న ఇళ్ల నిర్మాణాలు



జగనన్న కాలనీలో నిర్మాణంలో ఉన్న ఇళ్లు

పాలకొండ: నగరపంచాయతీ పరిధిలోని జగనన్న లేఅవుట్‌లో ఇళ్ల నిర్మాణాలు శరవేగంగా జరుగుతున్నాయి. నగర పంచాయతీ పరిధిలో సుమారు 1450 మంది పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించగా.. ప్రస్తుతం 50 శాతం మేర నిర్మాణాలు ప్రారంభమయ్యాయి. మొత్తం నిర్మాణాలు పూర్తయితే మరో కొత్త పట్టణం రూపుదిద్దుకోనుంది. లేఅవుట్‌లో పూర్తిస్థాయిలో అంతర్గత రహదారుల నిర్మాణం, విద్యుత్, తాగునీటి సౌకర్యాల కల్పనపై అధికారులు దృష్టిసారించారు. సుమారు రూ.7 కోట్లతో విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణం చేపడుతున్నారు. మార్చినాటికి ఇళ్ల నిర్మాణాలు శతశాతం పూర్తిచేయాలనే లక్ష్యంతో పనిచేస్తున్నారు. ఈమేరకు లబ్ధిదారులకు అవగాహన కల్పిస్తున్నారు.

ప్రతి రోజు 4వేల మందికి ఉపాధి

- ఐటీడీఏ పీఓ నవ్య



వీరఘట్టం: మాట్లాడుతున్న ఐటీడీఏ పీఓ నవ్య

వీరఘట్టం: పని కావాలని వచ్చిన వేతనదారులందరికీ ఉపాధిహామీ పథకం ద్వారా పని కల్పించాలని సీతంపేట ఐటీడీఏ పీఓ బి.నవ్య సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ సిబ్బంది, హౌసింగ్ అధికారులతో మంగళవారం సమీక్ష నిర్వహించారు. రోజుకు కనీసం 4వేల మందికి ఉపాధి పనులు కల్పించాలని, సగటున రూ.220 వేతనం గిట్టుబాటు అయ్యేలా చూడాలని సూచించారు. మండలంలో చేపట్టిన గృహ నిర్మాణాలు వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. సమీక్షలో హౌసింగ్ డీఈ మోహనరావు, ఏఈ వి.వినోద్, ఉపాధిహామీ ఏపీడీ జి.శ్రీహరిరావు, ఎంపీడీఓ ఎ.ప్రభాకరరావు, ఏపీఓ జి.సత్యంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులు సక్రమంగా చేపట్టాలి

పాలకొండ: ఉపాధిహామీ పనులు సక్రంగా చేపట్టాలని ఐటీడీఏ పీఓ నవ్య ఆదేశించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో ఉపాధిహామీ సిబ్బందితో మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. మండలంలో ఇంతవరకు గుర్తించిన పనులు, ప్రస్తుతం జరుగుతున్న పనులపై సమీక్షించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు వేతనదారులకు పని కల్పించాలని సూచించారు. ప్రాధాన్యతా క్రమంలో పనులను పూర్తిచేయాలన్నారు. ఆమెతో పాటు ఎంపీడీఓ త్రినాథులు ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో కుంకుమ పూజలు



కుంకుమ పూజలు చేస్తున్న గ్రామస్తులు

వీరఘట్టం: మండలంలోని చిదిమి గ్రామంలో నూతనంగా నిర్మించిన పార్వతీ సమేత కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయ ప్రతిష్ఠోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. రెండో రోజు మంగళవారం అర్చకులు వెంకటరమణశాస్త్రి ఆధ్వర్యంలో మరకత లింగానికి, నందీశ్వరునికి గ్రామస్తులు ప్రత్యేక పూజలు, క్షీరాభిషేకం, కుంకుమార్చనలు చేశారు. సాయంత్రం మహిళలు కలశాలతో ఊరేగింపు నిర్వహించారు. బుధవారం విగ్రహాల ప్రతిష్ఠ, అఖండ అన్నసమారాధన ఉంటుందని ఆలయ ధర్మకర్త తెలిపారు. పూజా కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

యువత చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

కురుపాం: యువత చట్టాలపై, రాజ్యాంగం కల్పించిన హక్కులు, బాధ్యతలపై అవగాహన కలిగి ఉండాలని ఉపాధిహామీ అంబుడ్స్‌మన్ కె.సన్యాసిరాజు పిలుపునిచ్చారు. కురుపాంలోని పెన్షనర్ల భవనంలో యూత్ ఎంపవర్‌మెంట్ సర్వీస్ సొసైటీ అధ్యక్షుడు షేక్ గౌస్‌సాహెబ్ ఆధ్వర్యంలో లిబ్‌టెక్ ఇండియా సహకారంతో సమాచార చట్టం, ఉపాధిహామీ చట్టంపై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన సన్యాసిరాజు మాట్లాడుతూ యువత చట్టాల పైన అవగాహన కలిగి ఉండాలని, ఉపాధిహామీ పథకం అమలులో సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని అన్నారు. కార్యక్రమంలో లిబ్‌టెక్ ఇండియా సంస్థ ప్రతినిధి కిశోర్ పాల్గొన్నారు.



అవగాహన సదస్సులో పాల్గొన్న అధికారులు, యువత

పంటనష్టాల పరిశీలన



పంట నష్టం వివరాలు సేకరిస్తున్న సబ్‌కలెక్టర్ నూరల్ కమర్

భామిని: ఏనుగుల సంచారంతో పాడైన పంటలను సబ్‌కలెక్టర్ నూరల్ కమర్ మంగళవారం పరిశీలించారు. మండలంలోని పాత ఘనసర, ఘనసర కాలనీల్లో పర్యటించారు. పంటలు నష్టపోయిన రైతులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. పంటలతో పాటు వ్యవసాయ బోర్లు, మోటార్లను ఏనుగులు ధ్వంసం చేశాయని రైతులు వాపోయారు. సబ్‌కలెక్టర్‌తో పాటు తహసీల్దార్ నీలాపు అప్పారావు, ఆర్ఐ ఎస్.రాంబాబు, వీఆర్వో సీహెచ్ భారతి, వైఎస్సార్‌సీపీ కార్యదర్శి కిల్లారి ఫాల్గుణరావు, మాజీ ఎంపీపీ బి.ఆనందరావు, మాజీ ఎంపీటీసీ కె.కాంతారావు తదితరులు ఉన్నారు.

భూ హక్కు పత్రాల పంపిణీ

పాలకొండ: మండలంలోని వాటపాగు గ్రామంలో జగనన్న శాస్వత భూ హక్కు పత్రాలను డీటీ పి.సన్యాసిరావు, సర్పంచ్ రాజారావు మంగళవారం పంపిణీ చేశారు. గ్రామంలో 350 మంది లబ్ధిదారులకు వీటిని పంపిణీ చేశారు. గ్రామంలో భూసర్వే వందశాతం పూర్తి చేసి, రైతులందరికీ తప్పులు లేకుండా భూహక్కు పత్రాలు అందజేసినట్లు డీటీ తెలిపారు.



భూ హక్కు పత్రాలు పంపిణీ చేస్తున్న డీటీ, సర్పంచ్

గ్రీన్ అంబాసిడర్లకు దుప్పట్ల పంపిణీ

గుమ్మలక్ష్మీపురం:

ఎల్విన్‌పేట, గుమ్మలక్ష్మీపురం పంచాయతీల పరిధిలో పనిచేస్తున్న గ్రీన్ అంబాసిడర్లకు దోస్త్ మేరా దోస్త్ సంఘం సభ్యులు మంగళవారం దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు పాలక ప్రేమానంద్, సర్పంచ్ బొత్తాడ గౌరీశంకరరావు, వైస్ ఎంపీపీ నిమ్మక శేఖర్ మాట్లాడుతూ గ్రామాలను పరిశుభ్రంగా ఉంచేందుకు నిత్యం శ్రమిస్తున్న గ్రీన్ అంబాసిడర్లకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు గుడ్ల హరిప్రసాద్, బోటు లక్ష్మీనారాయణ, మద్ది శ్రీధర్, కినిస సూర్యం, వైస్ సర్పంచ్ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.



గ్రీన్ అంబాసిడర్లకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న దోస్త్ మేరా దోస్త్ సభ్యులు

విద్యార్థులకు డీఈఓ అభినందన



వీరఘట్టం: రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో బంగారు పతకాలు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న డీఈఓ రమణ



వీరఘట్టం: బంగారు పతకంతో బొద్దాన రాజు

వీరఘట్టం: రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో బంగారు పతకాలు సాధించిన తలవరం ఉన్నత పాఠశాల విద్యార్థులను డీఈఓ ఎస్‌డీవీ రమణ అభినందించారు. మంగళవారం పాఠశాలను ఆయన సందర్శించారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనాలు వండిపెట్టాలని వంట ఏజెన్సీ నిర్వాహకులకు సూచించారు. రికార్డులు సక్రమంగా నిర్వహించాలని, పదో తరగతిలో మంచి ఫలితాలు సాధించేలా విద్యార్థులను సన్నద్ధం చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్‌లో బంగారు పతకాలు సాధించిన విద్యార్థులు టి.కృష్ణ, ఆర్.హారికలతో పాటు వారికి తర్ఫీదునిచ్చిన పీడీ మజ్జి రామకృష్ణను అభినందించారు. భవిష్యత్‌లో మరిన్ని పతకాలు సాధించాలని ఆకాంక్షించారు.

టెన్నీకాయిట్‌లో బంగారు పతకం

ఎన్‌టీఆర్ జిల్లా నందికొట్కూరులో జరుగుతున్న రాష్ట్రస్థాయి టెన్నీకాయిట్ స్కూల్ గేమ్స్‌లో తలవరం ఉన్నత పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థి బొద్దాన రాజు బంగారు పతకం సాధించినట్లు హెచ్‌ఎం ఉప్పాడ అప్పారావు మంగళవారం తెలిపారు. పాఠశాలకు చెందిన విద్యార్థి రాష్ట్రస్థాయి పోటీల్లో రాణించడం ఎంతో గర్వకారణమన్నారు. విద్యార్థి రాజుకు, పీడీ రామకృష్ణకు అభినందనలు తెలిపారు.



కురుపాం: మనోహర్‌ను సన్మానిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు, గ్రామస్తులు

విద్యార్థికి సత్కారం

కురుపాం: శ్రీకాకుళంలో ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ పోటీల్లో కురుపాం మండలం మొండెంఖల్ గ్రామానికి చెందిన బిడ్డిక మనోహర్ పరుగు పోటీల్లో ద్వితీయ స్థానంలో నిలిచాడు. విద్యార్థిని వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ సభ్యుడు గుడారి విద్యారాణి, రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ ఇందిరాకుమారి, నాయకులు రేవు సత్తిబాబు, బిడ్డిక అనంత్‌లు తదితరులు మంగళవారం అభినందించారు. భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.